క్లుప్తంగా

మహిళా సంఘం అధ్యక్షురాలిగా చిట్టెమ్మ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో గ్రామ మహిళా సంఘం సభ్యులు ఎత్తం చిట్టెమ్మను సంఘం అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షురాలిగా చెన్నమ్మ, కార్యదర్శిగా అలివేల, కోశాధికారిగా గడ్డమీది ఎల్లమ్మ, సలహాదారుగా లతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో మహిళల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన అధ్యక్షురాలు చిట్టెమ్మ తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సీసీ వీరయ్య, బుక్ కీపర్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కనెక్షన్ ఇస్తాం

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ లేదనే విషయంపై సాక్షిలో 'స్తంభాలు పాతారు.. కనెక్షన్ మరిచారు' అని ప్రచురితం అయిన కథనానికి మండల ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి గురువారం స్పందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ కోసం పాతిన స్తంభాలు మైదానంలో మధ్యలో పాతారని, ఆ స్తంభాలను మధ్యలో కాకుండా ఒక వైపు నుంచి పాతాలని సూచించాం. దీంతో పాటు అంచనా వ్యయం కాపీ రాగానే స్తంభాలను షిఫ్ట్ చేసి కనెక్షన్ ఇస్తాం. ఎలాంటి అంచనా వ్యయం ప్రతిపాదనలు అధికారికంగా రాకపోయినా.. గ్రామ ప్రజాప్రతినిధుల ఒత్తిడితో స్తంభాలు ఇస్తే వారే పాతించారు.

సెల్‌ఫోన్ అందజేత



వనపర్తి రూరల్: మండలంలోని సింగాయిపల్లి తండాకు చెందిన దివాకర్ సెల్‌ఫోన్ పోయిందని వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించి, రికవరీ చేశామని ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ బాధితుడికి సెల్‌ఫోన్లు అందజేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

వనపర్తి రూరల్: మండలంలోని సవాయిగూడెం జములమ్మతండాలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తండాలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను గిరిజనులకు వివరిస్తూ వారికి పార్టీ సభ్యత్వాలు అందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గోపాల్‌పేట: మండల కేంద్రంలో గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన కొంకలి శేషన్న కుమారుడు కొంకలి విజయ్ గోపాల్‌పేటకు సమీపంలోని వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా పోలీసులు ట్రాక్టర్‌ను నిలిపి ఇసుక తరలించేందుకు అనుమతి పత్రాలు ఉన్నాయా అని అడుగగా ఎటువంటి అనుమతి పత్రాలు చూపించలేదు. దీంతో ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యువతి అదృశ్యం

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడకు చెందిన మంద పద్మ అనే యువతి కనిపించకుండా పోయిందని గురువారం ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. మామిడిమాడకు చెందిన మంద పెంటయ్య, మల్లమ్మ దంపతుల కుమార్తె పద్మ వారం రోజుల కిందట మహబూబ్‌నగర్‌కు కళాశాలకుక వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వారు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. చేసేది లేక గురువారం యువతి తల్లి మల్లమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కొత్తకోట రూరల్: బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన గల చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి సమీపంలో ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మదనాపురం మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన కోట్ల రామిరెడ్డి, కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన దామోదర్‌రెడ్డి ఇద్దరు కలిసి ఉదయం బైక్‌పై బీచుపల్లి ఆలయానికి వెళ్లి ఆంజనేయస్వామి దర్శనం చేసుకున్నారు. తిరిగి సాయంత్రం కొత్తకోటకు వెళ్తుండగా ముమ్మళ్లపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకు దిగి చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం గురించి ఎస్‌ఐని వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేదన్నారు.

బాలల రక్షణ అందరి బాధ్యత



మదనాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కొత్తకోట రూరల్: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాల బాలికలను రక్షించుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెద్దమందడి తహసీల్దార్ సరస్వతి అన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం గురువారం పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు కోసం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో గల బాలల పరిరక్షణ కమిటీలను సమన్వయం చేసుకొని మండల బాలల పరిరక్షణ కమిటీ పనిచేస్తుందన్నారు. 18ఏళ్లు నిండని అమ్మాయికి, 21ఏళ్లు నిండని అబ్బాయికి పెళ్లిళ్లు చేయకూడదన్నారు. పిల్లలను బడి మాన్పించి పనిలో ఉంచినట్లయితే బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి, ఎంపీడీఓ సద్గుణ, ఎంపీఓ పుష్ప, ఎంఈఓ బాణం విష్ణు, డాక్టర్ వీణ, ఐసీడీఎస్ కౌన్సిలర్ స్వరూప, సీహెచ్‌ఎల్ సిబ్బంది బాలరాజు, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, కేజీబీవీ ఎస్‌ఓ తదితరులు ఉన్నారు.

అమరచింత: బాల్యవివాహాలను నిరోధించి బాలికలు చదువులో రాణించేలా తల్లిదండ్రులు సహకరించాలని ఎంపీఓ నరసింహులు అన్నారు. మండలంలోని చంద్రనాయక్‌తండా పంచాయతీలో గురువారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈమేరకు ఎంపీఓ మాట్లాడుతూ గిరిజన తండాల్లోనే బాల్యవివాహాలు అధికంగా జరిగేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిందని, అయినా ఇంకా కొనసాగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి నిరంతరం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుచిత్ర తదితరుల పాల్గొన్నారు.



చంద్రనాయక్‌తండాలో..



పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో..

మహిళల హక్కులు కాపాడాలి

వీపనగండ్ల: మండలంలో మహిళలు, చిన్నారుల హక్కులు కాపాడడం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మహిళలు, బాలికల సంరక్షణపై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

మదనాపురం: తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా సంక్షేమ ఇన్‌చార్జ్ అధికారి లక్ష్మమ్మ సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో అందరూ సహకరించాలని కోరారు. తహసీల్దార్ అబ్రహం లింకన్ మాట్లాడుతూ బాల్యవివాహాలు నిర్మూలించడంలో భాగంగా వారిని ఉన్నత చదువులు చదివించాలని కోరారు. అనంతరం బాల్య వివాహాలు అరికడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మల్లికార్జున్, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, వైద్యాధికారి భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న నాబార్డు కౌన్సిలర్ సురేష్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పాటించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని నాబార్డు కౌన్సిలర్ సురేష్‌రెడ్డి, బ్రాంచ్‌మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఏపీజీవీబీ వెల్కిచెర్ల బ్రాంచ్ ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంతభాగం పొదుపు చేసుకోవాలన్నారు. కుటుంబ అవసరాలు, అత్యవసర సమయంలో ఈ నగదు ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా పొదుపు చేసుకున్న నగదులో కొంత మొత్తాన్ని బీమా కోసం వెచ్చించాలన్నారు.

బీమాతో ధీమా

ప్రస్తుత సమయంలో రూ.10 వేల విలువ చేసే సెల్‌ఫోన్‌కు బీమా చేయిస్తున్నారు కానీ జీవితానికి బీమా చేసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రూ.20 నుంచి రూ.436 తో సంవత్సరం పాటు మనకు బీమా కల్పించే పథకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆయన చెప్పారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్‌కు సంబంధించిన ఖాతా వివరాలు, ఓటీపీ ఇతరులకు చెప్పరాదని సూచించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడే కొత్తవారికి ఋణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారులు విజయ్‌కుమార్, హన్మతునాయుడు, మహేష్, మాజీ సర్పంచు కృష్ణవేణి, నర్సింహారెడ్డి, శంకర్‌గౌడ్, విష్ణు, కృష్ణయ్య, మల్లేష్, డీలర్ చెన్నయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ



అమరచింత: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని మిట్టనందిమళ్ల గ్రామంలో గురువారం గ్రామస్తుల సహకారంతో రూ.2.30 లక్షలతో 18 సీసీ కెమెరాలను కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు మాజీ సర్పంచ్ సర్వారెడ్డితో కలిసి గ్రామంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, సమస్య గల ప్రదేశాలను గుర్తించి, ఆయా ప్రాంతాలలో సీసీ కెమెరాలను అమర్చుతామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలందరూ శాంతి భద్రతల కోసం పోలీసులకు సహకరించాలని కోరారు.

భూ ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

అమరచింత: వ్యవసాయ పొలాన్ని ఆక్రమించేందుకు యత్నం చేస్తూ వ్యవసాయ పరికరాలతో పాటు బావిని, పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారంటూ కుర్వ గోవింద్, గ్రామానికే చెందిన రంగన్నపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని నందిమళ్లకు చెందిన కుర్వ గోవిందుకు సర్వేనంబర్ 230లో 25 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. పక్కనే సర్వేనంబర్ 231లో ఉన్న కుర్వ రంగన్న తన ఎకరం పొలాన్ని గోవింద్ కబ్జా చేశారంటూ తరచూ గొడవకు పాల్పడేవారని ఎస్‌ఐ తెలిపారు. ఈమేరకు కోర్టు పరిధిలో ఉన్న పొలంలోని వ్యవసాయ బావితో పాటు పంపుసెట్లను కుర్వ రంగన్న తన కొడుకులతో కలిసి మంగళవారం మధ్య రాత్రి ధ్వంసం చేశాడంటూ బాధితుడు బుధవారం ఫిర్యాదు ఇవ్వడంతో గురువారం ఘటన స్థలాన్ని పరిశీలించి రంగన్నపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.



ఇరు వర్గాలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

వైద్య విద్యార్థినికి సన్మానం



వనపర్తిటౌన్: నీట్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించిన స్కాలర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ కృష్ణకుమార్ కుమార్తె మేఘనను పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. శ్రమజీవిగా పేరుపొందిన కేకే ప్రతిష్ఠను నిలబెట్టేలా మేఘన ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత



విద్యార్థులకు టై, బెల్టు అందజేసిన ఎంఈఓలు విష్ణు, జయశంకర్, ఉపాధ్యాయ బృందం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు, సహచర ఉపాధ్యాయ బృందం తమ సొంత ఖర్చులతో విద్యార్థులందరికీ స్కూల్ పేరు ముద్రించిన టై, బెల్టులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓలు బాణం విష్ణు, జయశంకర్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల మాదిరిగా కనిపించేందుకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అందరం కలిసి చర్చించుకుని సొంత డబ్బులు వెచ్చించి టై, బెల్టులు అందజేసినట్లు హెచ్‌ఎం నాగేశ్వరమ్మ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ కనీస వేతనాలకు గ్రామపంచాయతీ కార్మికులు నోచుకోవడం లేదని, నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. నవంబర్ 5, 6 తేదీల్లో జరిగే 48 గంటల రిలే దీక్షలో కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీఓకు అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు వెంకట్రాములు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అంజి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మధు, కార్యదర్శి జాంగీర్, రాములు, రవి, నాగన్న, ఖాదర్, భాస్కర్, గాలెన్న, మొగులమ్మ, లక్ష్మమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు సన్నాహక సదస్సు విజయవంతం చేద్దాం

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చే వరకు ప్రజల తరఫున పోరాడుతామని బీఆర్‌ఎస్ పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బాల్‌రాజు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన మోసపూరిత హామీలపై ఈనెల 29న వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పదివేల మంది రైతులతో నిర్వహించ తలపెట్టిన రైతు నిరసన సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరీష్‌రావు వస్తున్నారని, పార్టీ కార్యకర్తలు స్థానికంగా ఉండే రైతులను చైతన్యపరిచి జిల్లా కేంద్రానికి చేరుకుని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కురుమూర్తి యాదవ్, తిరుపతి యాదవ్, హర్యానాయక్, చంద్రశేఖర్, మతీన్, మన్యంనాయక్, వడ్డెగోపాల్ ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పాన్‌గల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.సురేష్ అన్నారు. గురువారం మండలంలోని చింతకుంటలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో రైతులు అందుబాటులో ఉంటూ తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఎస్‌ఏ సత్యనారాయణ, వీఏ బాలీశ్వర, పశువైద్య సిబ్బంది బుచ్చన్న, చంద్రయ్య, శివ, కార్తీక్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత

పాన్‌గల్: ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపులో రైతులకు ఉపయోగపడే వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని దావాజిపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. గురువారం గ్రామంలో 2025–26 సంవత్సరానికి పనుల గుర్తింపుపై గ్రామ సభ నిర్వహించారు. ఏఏ పనులు చేపట్టాలి, ప్రాధాన్యత ఇచ్చే పనులు ఏవి అనే అంశాలపై గ్రామ సభలో చర్చించి అందరి ఏకాభిప్రాయంతో చేపట్టే పనులకు తీర్మానం చేశారు. దీంతో పాటు గ్రామంలో ఇందిరమ్మ కమిటీలపై చర్చించి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా లోక్యానాయక్, ప్రేమ్‌సాగర్, గట్టయ్య, కృష్ణ, సూగురమ్మ, దయాకర్, కృష్ణమ్మను ఎన్నుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్యయాదవ్, మాజీ ఉప సర్పంచ్ సురేందర్‌గౌడ్, యుగేందర్‌గౌడ్, సుక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన తెలుగు గణేష్‌కు మంజూరైన రూ.60 వేల సీఎం సహాయనిధి చెక్కును గురువారం కాంగ్రెస్ నాయకులు సురభి పుల్లారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు గణేష్ గతేడాది ట్రాక్టర్ నడుపుతూ కిందపడటంతో తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆస్పత్రిలో అయిన ఖర్చులకు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో మంత్రి జూపల్లి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైందన్నారు. కార్యక్రమంలో డోకారావు, రాజుగౌడ్, ప్రసాద్‌గౌడ్, దశరథం, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, మిద్దె నరేష్, బాలరాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెంచిన పింఛన్‌ను అమలులోకి తేవాలి



తూంకుంటలో కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు, వృద్ధులకు రెట్టింపు పింఛన్ ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని తూంకుంటలో గ్రామ మహిళలతో కలిసి పంచాయతీ కార్యదర్శి వహీద్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. 2024 నుంచి రూ.4,016 పింఛన్ డబ్బులతో పాటు దివ్యాంగులకు నెలకు రూ.6,016 అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. నిత్యావసర సరుకులకు అనుగుణంగా పింఛన్ డబ్బులను పెంచితే మహిళలకు మేలు జరుగుతుందని లేకుంటే మహిళలను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బాలకిష్టమ్మ, దేవమ్మ, చంద్రమ్మ, నాగమ్మ, గోపాల్‌రెడ్డి, బారయ్య తదితరులు పాల్గొన్నారు.

'అనీమియా'పై అవగాహన

పాన్‌గల్: అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ తారళాంక్ అనీమియా నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రం చేసుకోవడం, పౌష్టికాహారం తదితర అంశాలపై వివరించారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

మండలంలోని శాగాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఏఎన్‌ఎం సుమిత్ర ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. విద్యార్థులల్లో రక్తహీనత నివారణ కోసం ఐరన్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు.



విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న ఏఎన్‌ఎం సుమిత్ర

గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి



మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వీపనగండ్ల: మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు సహకరించాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ మండల నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణానికి రూ.1.75కోట్లు మంజూరయినా పనులు ప్రారంభించలేదని, సమైక్య కార్యాలయం, పంచాయతీ భవన నిర్మాణంతో పాటు 30 పడకల ఆస్పత్రికి వైద్య సిబ్బంది నియామకం, సింగోటం, గోపల్‌దిన్నె రిజర్వాయర్ కాల్వ త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుని నిధులు మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, ఎత్తం కృష్ణయ్య, బసవరాజుగౌడ్, రవీందర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, గోపి, నర్సింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



మదనాపురంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రావుల



దుప్పల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాములు తల్లి మరణించడంతో గురువారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన భరత్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్త రాములు మరణించడంతో బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు.

పరామర్శ

మండల కేంద్రానికి చెందిన మార్కెట్ మాజీ డైరెక్టర్ వెంకటేష్‌యాదవ్ అనారోగ్యానికి గురి కావడంతో గురువారం మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆయన స్వగృహంలో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అధికారం లేదని కార్యకర్తలు అధైర్యపడొద్దని, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్, బీఆర్‌ఎస్ మహిళా విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు జయంతమ్మ, మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు చాంద్‌పాషా, అనిమోని మాసన్నయాదవ్, మనోజ్‌కుమార్, టీకే కురుమన్న, ఎంకే కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగాల్లో వర్గీకరణ అమలు చేయాలి

వనపర్తి టౌన్: విద్య, ఉద్యోగాల్లో వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు డిమాండ్ చేశారు. ఈ నెల 30న జడ్చర్లలో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ సభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు గురువారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో మాదిగల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడుగురు సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడెందుకు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఇంతకముందు ఇచ్చిన ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ అమలు చేయకుండా కుట్ర పన్నుతున్నాడని దుయ్యబట్టారు. మాదిగలను నమ్మించి మోసగిస్తే రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం దిగిరాకుంటే మందకృష్ణ మాదిగ నేతృత్వంలో విస్తృత పోరాటాలకు, నిరసనలకు దిగనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసులు, చెన్నయ్య, పవన్‌కల్యాణ్, లక్ష్మయ్య, శరత్, కృష్ణయ్య, చంద్రశేఖర్, కుశకుమార్, గంధం రాజు, అడ్డాకుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.